నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, బుధవారం 9 అక్టోబర్ 2024 MEDAK

## వేతనాలు రాలేదని ఆశ వర్కర్ల ఆవేదన


సిద్దిపేటలో ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 8: ఒకటో తేదీన రావాల్సిన వేతనాలు ఎనిమిదో తేదీ దాటినా రాలేదని, పండుగ పూట వేతనాల కోసం ఎదురుచుస్తున్నామని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన సమయంలో ఇబ్బందులు పడుతున్నామని మాజీమంత్రి హరీశ్‌రావుకు ఆశవర్కర్లు గోడు వెళ్లబోసుకున్నారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి బాధలు చెప్పుకొన్నారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు.

## ఏడుపాయల్లో వైభవంగా ఉత్సవాలు


ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలోని గోకుల్‌షెడ్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి

పాపన్నపేట, అక్టోబర్ 7: ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో శరన్నరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు శ్రీదుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోకుల్ షెడ్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ దంపతులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు తీసే కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారికి వేడుకున్నట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో ఈవో చంద్రశేఖర్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్మరి జగన్, ఆలయ మాజీ చైర్మన్ బాటగౌడ్, మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్‌రెడ్డి, గంగారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు లింగమయ్య గౌడ్ మృతి



అందోల్, అక్టోబర్ 8: జోగిపేటకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తామరపత్ర గ్రహీత గడీండ్ల లింగమయ్యగౌడ్(96) అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని రోజులు గా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 15 నవంబర్ 1928లో జన్మించిన లింగమయ్యగౌడ్ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1969లో జరిగిన తెలంగాణ తొలిదశ ఉద్యమంలో సైతం కీలక పాత్ర పోషించారు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా రైతుల సాయుధ పోరాటంలో పాల్గొన్ని వారికి మద్దతుగా నిలిచారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ లింగమయ్యగౌడ్ ఇంటికి వెళ్లి ఆయన్ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. లింగమయ్యగౌడ్ మృతికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, ఇతర ప్రముఖులు, పలు పార్టీల నాయకులు సంతాపాన్ని తెలియజేశారు. నేడు జోగిపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## క్రషర్, క్వారీ పనులు నిలిపివేయాలి


తహసీల్దార్ భిక్షపతికి ఉత్తర్వు కాపీని అందజేస్తున్న రాళ్లకత్వ గ్రామస్తులు

జిన్నారం, అక్టోబర్ 8: మండలంలోని రాళ్లకత్వ శివారులోని సర్వేనంబర్ 286 అసైన్డ్ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న కంకర క్రషర్, క్వారీ పనులు నిలిపివేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్తర్వు ప్రతులను మంగళవారం తహసీల్దార్ భిక్షపతి, సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ నాగలక్ష్మిలకు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సర్వే నంబర్ 286లోని అసైన్డ్, ప్రభుత్వ భూమిలో నకిలీ పత్రాలు సృష్టించి కంకర, క్రషర్ పనులు కొనసాగిస్తుండడంతో గ్రామస్తులందరం న్యాయ పోరాటానికి సిద్ధమయ్యామని, కొన్ని రోజులుగా ప్రభుత్వం, మైనింగ్ అధికారులకు ఆధారాలు సమర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు. విచారణ అనంతరం క్వారీ, క్రషర్ ఏర్పాటు పనులు నిలిపేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. ప్రజల మొర విన్న ఉన్నతాధికారులు పనులు నిలిపివేయాలని ఉత్తర్వులు ఇవ్వడం సంతోషం ఉందని గ్రామస్తులు తెలిపారు. రాళ్లకత్వ గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద ఉత్తర్వు ప్రతులను గ్రామస్తులు ప్రదర్శించారు. క్వారీ, క్రషర్ యాజమాన్యం ఉత్తర్వులను ఉల్లంఘిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని ముక్త కంఠంతో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా, సమస్యలు ఏర్పడినా జిల్లా ఉన్నతాధికారులు బాధ్యత వహించాలన్నారు.

## పనిబాటల వారిపై చిర్రుబుర్రుమన్న ఈవో

పాపన్నపేట,అక్టోబర్ 8: అనాథిగా వస్తున్న ఆచారం ప్రకారం పెట్టుబొతలడిగిన పనిబాట వారిపై ఏడుపాయల ఈవో చిర్రుబుర్రు మనగా, ఇరువురికి వాగ్వాదం జరిగిన సంఘటన చోటుచేసుకుంది. దీంతో ఈవో వైఖరిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో ఏ ఉత్సవం నిర్వహించినా 18 రకాల పనిబాటల వాళ్లు పాల్గొంటారు. కార్యక్రమం అయిపోయాక వారికి ఎంతోకొంత ఆలయం నుంచి డబ్బులు సమర్పిస్తుంటారు. ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం బోనాలు తీసే కార్యక్రమం నిర్వహించారు. దీనికి కుమ్మరి వాళ్లు కుండలు తెచ్చారు. చాకలి వారు సున్నం వేశారు. ఇతరులు వారి ఆచారం ప్రకారం వారి వారి పనులు చేశారు. కార్యక్రమం అయిపోగానే తమ పెట్టుబోత గురించి ఈవో కార్యాలయానికి వెళ్లి అడిగారు. దీనికి స్పందించి ఈవో ఎందుకు వచ్చారంటూ వారిపై త్రీవ ఆగ్ర హం వ్యక్తం చేస్తూ చిర్రుబుర్రు లాడారు. డబ్బులు అడగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా డప్పులు కొట్టడానికి మొదలుకొని ప్రతి దానికి టెండర్ నిర్వహిస్తామని బెదిరింపు ధోరణికి పాల్పడ్డారు. దీంతో ఈవో వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయించుకుని డబ్బులు ఇవ్వరా అని ఆవేదన వ్యక్తం చేశారు.

## సింగూరుకు తగ్గిన వరద


నిండుకుండలా సింగూరు ప్రాజెక్టు

పుల్కల్, అక్టోబర్ 8: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. వరద తగ్గడంతో ప్రాజెక్టు అధికారులు క్రస్ట్ గేట్లను మూసి వేశారు. మంగళవారం విద్యుత్ ఉత్పత్తి కోసం జెన్కోకు 2810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 29.768 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ఆక్రమణలపై చర్యలకు రెడీ..!

- చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రా నజర్
- పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాలపై దృష్టి
- నీటిపారుదల శాఖ నుంచి వివరాల సేకరణ
- హైడ్రాకు చేరిన 50కి పైగా చెరువుల వివరాలు
- త్వరలో నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేపట్టే అవకాశం



ఇటీవల సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో పేలుడు పదార్థాలతో బహుళ అంతస్తుల భవనాన్ని నేల మట్టం చేసిన హైడ్రా అధికారులు (ఇన్‌సెట్‌లో) కూల్చివేతకు ముందు..

సంగారెడ్డి, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రా యాక్షన్‌కు సిద్ధమవుతున్నది. పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటల ఆక్రమణలకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులు 50కిపైగా చెరువుల సమాచారాన్ని హైడ్రాకు అందజేశారు. తమకు అందిన చెరువులకు సంబంధించిన వాటిల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాలను హైడ్రా సొంత సిబ్బందితో సర్వే చేయించి గుర్తిస్తున్నది. ఇలా గుర్తించిన ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలను తొలిగిస్తున్నది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల అమీన్‌పూర్, పటాన్‌చెరులో పర్యటించి చెరువుల ఆక్రమణలను పరిశీలించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కేవలం అమీన్‌పూర్ చెరువులోని ఓ ఆంధ్రానేత నిర్మించిన షెడ్లను మాత్రమే హైడ్రా అధికారులు తొలిగించారు. మిగతా ఎక్కడా హైడ్రా అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టలేదు. ఇటీవల హైడ్రాకు చట్టబద్ధత కల్పించడంతో ఇక అక్రమ నిర్మాణాల తొలిగింపుపై హైడ్రా దృష్టి సారించినట్లు తెలుస్తున్నది.

### పటాన్‌చెరులో ఆక్రమణలపై చర్యలు?

హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే పటాన్‌చెరు,ఆర్‌సీపురం అమీన్‌పూర్, గుమ్మడిదల, జిన్నారం, సంగారెడ్డి, కంది, హత్నూర మండలాల్లో 666 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో మొదటగా 50కిపైగా చెరువులు, కుంటల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణకు గురికావడంతో పాటు అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు నీటిపారుదల శాఖ గుర్తించింది. కొన్ని చెరువులు, కుంటల ఆక్రమణకు సంబంధించి నీటిపారుదల శాఖ అధికారులు ఇది వరకే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. కొన్నిచోట్ల అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అమీన్‌పూర్ మండలంలోని పోచమ్మకుంట, ఊబకుంట, శెట్టికుంట, బందం కొమ్ము చెరువు, ఉసికెబావి, ఉప్పరివానికుంట, శంభునికుంట, కుమ్మరికుంట, పెద్దచెరువు, కొత్తచెరువు, గాంధీకుంట, కొనేటికుంటతోపాటు పలు చెరువులు ఆక్రమణలకు గురైనట్లు నీటిపారుదల శాఖ గుర్తించింది. పటాన్‌చెరు మండలంలోని సాకి చెరువు, చౌదరికుంట, గొల్లకుంట, చౌట్లకుంట, కొమటికుంట, నల్లకుంట, కండ్లకుంట, తెట్టేకుంటతోపాటు పలు చెరువులు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఆర్‌సీపురంలోని నాగులకుంట, చెల్లికుంట, మేళ్ల చెరువుతోపాటు పలుచెరువులు ఆక్రమణలకు గురైనట్లు నీటిపారుదలశాఖ అధికారులు గుర్తించారు. వీటి వివరాలను హైడ్రాకు అందజేశారు. వీటితోపాటు గుమ్మడిదల, జిన్నారం, హత్నూర మండలాల్లో ఆక్రమణకు గురైన చెరువుల వివరాలను నీటిపారుదల శాఖ అధికారులు హైడ్రా అధికారులకు అందజేశారు. నీటిపారుదల శాఖ అందజేసిన ఆక్రమణలను హైడ్రా మరోసారి సర్వే చేసి చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు ముందు నోటీసుల జారీకి అధికారులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

### సంగారెడ్డిలోని చెరువులు ఆక్రమణలపై దృష్టి

సంగారెడ్డి, కంది మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. దీంతో కంది, సంగారెడ్డి మండలాల్లో చెరువుల ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించింది. సంగారెడ్డి మండలంతోపాటు సంగారెడ్డి మున్సిపాలిటీలో ఆక్రమణకు గురైన 20కిపైగా చెరువుల సమాచారాన్ని నీటిపారుదల శాఖ అధికారులు హైడ్రాకు అందజేసినట్లు తెలిసింది. సంగారెడ్డి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో ఆరు ఎకరాలు, మహబూబ్‌సాగర్ చెరువులో 5.40 ఎకరాలు, ఎర్రకుంట(చౌదరికుంట) పరిధిలో 6.50 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. పోతిరెడ్డిపల్లిలోని మాసానికుంట, రాజంపేటలోని తుర్కవానికుంట, దేవునికుంట, కల్వకుంలోని తిమ్మనికుంట ఆక్రమణకు గురైనట్లు నీటిపారుదలశాఖ అధికారులు గుర్తించారు. వీటితోపాటు సంగారెడ్డి, కంది మండలాల్లోని ఆక్రమణకు గురైన చెరువుల వివరాలను నీటిపారుదల శాఖ అధికారులు సేకరించి హైడ్రా అధికారులకు అందజేసినట్లు సమాచారం.


చిన్నకోడూరులో బతుకమ్మ ఆడుతున్న హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, సిద్దిపేట మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

## అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

### చిన్నకోడూరు వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత

చిన్నకోడూర్, అక్టోబర్ 8 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని ఆరు గ్రామాల్లో ఏడొద్దుల సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలకేంద్రమైన చిన్నకోడూర్‌తోపాటు మాచాపూర్, అల్లీపూర్, చెలకలపల్లి, కమ్మర్లపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో మహిళలు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి ఏడొద్దుల సద్దుల బతుకమ్మను సంబురంగా జరుపుకొన్నారు. చిన్నకోడూర్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడారు. ఈ సందర్భం గా శ్రీనిత మాట్లాడుతూ.. ప్రకృతిసిద్ధంగా దొరిగే పూలతో అం దంగా బతుకమ్మను పేర్చి సంప్రదాయబద్ధంగా మహిళలు సం బురాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, మహిళలు పాల్గొన్నారు.


బతుకమ్మను నీటిలో వదులుతున్న శ్రీనిత


బతుకమ్మతో శ్రీనిత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


చిన్నకోడూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొగ్గు చూపాలి

- ఎగుమతులు చేసే స్థాయికి ఎదగాలి
- ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ నీరజా ప్రభాకర్
- సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో డ్రాగన్ ఫ్రూట్ మేళా


సంగారెడ్డిలో నిర్వహించిన డ్రాగన్ ఫ్రూట్ మేళాను సందర్శిస్తున్న ఉద్యాన వన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజాప్రభాకర్

కంది, అక్టోబర్ 8: అత్యంత పోషకాలున్న డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజా ప్రభాకర్ రైతాంగానికి పిలుపునిచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. సంగారెడ్డిలోని ఫల పరిశోధన స్థానం (ఎఫ్ఆర్ఎస్)లో మంగళవారం డ్రాగన్ ఫ్రూట్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉద్యాన వన వీసీ పాల్గొని మేళాను ప్రారంభించారు. మేళాలో ప్రదర్శించిన 32 రకాల డ్రాగన్ ఫ్రూట్స్, డ్రాగన్ ఫ్రూట్‌తో తయారు చేసిన బిస్కెట్స్, చిప్స్, చాక్‌లెట్స్, కాస్మోటిక్స్ తదితర వాటిని తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకప్పుడు డ్రాగన్ ఫ్రూట్ అంటే కేవలం డబ్బులున్నవారే కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం సామాన్యులు సైతం కొనుగోలు చేసేస్థాయికి వచ్చిందంటే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగడం వల్లేనని తెలిపారు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఈ పండును మనమే ఎగుమతి చేసే స్థాయికి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పనికి రాని భూమిలో సైతం ఈ పంటను సాగు చేయవచ్చన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహద పడే ఈ పంటను సాగు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా రైతులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3300 హెక్టార్లలో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారని, మొదటి స్థానంలో రంగారెడ్డి, రెండో స్థానంలో సంగారెడ్డి జిల్లా ఉందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ముందుకు వచ్చే రైతాంగానికి ఉద్యాన వన శాస్త్రవేత్తలు తమ సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. సాగు విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఉద్యాన వన విశ్వవిద్యాలయ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ హరికాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ స్వామి, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సునీత, బిఎన్ఆర్ అధినేత, డ్రాగన్ ఫ్రూట్ సాగు ప్రోత్సాహక రైతు రమేశ్‌రెడ్డి, డ్రాగన్ ఫ్రూట్ రైతాంగ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కొల్లూర్‌లో 8 బైకులు దహనం


కొల్లూర్ గ్రామం(ఇన్‌సెట్‌లో) దహనమైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్

సదాశివపేట,అక్టోబర్ 8: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కొల్కూర్ గ్రామంలో బైక్‌ల దహనం మిస్టరీగా మారింది. 15 రోజుల్లో గ్రామంలో 8 బైక్‌లను తగులబెట్టారు. అసలు బైక్‌లు ఎవరు తగులబెడుతున్నారో ఎవరికీ అంతుపట్టడం లేదు. రాత్రి వేళల్లో దుండగులు బైక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటిస్తుండడంతో లక్షలు వెచ్చించి కొన్న బైక్‌లు బుగ్గిపాలవుతున్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురుతున్నారు. ఒకే రోజు రెండు బైక్‌లు తగులబెట్టారు. ఇప్పటి వరకు రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్, యూనికాన్, ఫ్యాషన్, షైన్ బైక్‌లకు దుండగులు దహనం చేశారు. వారం రోజుల నుంచి గ్రామస్తులు నిద్ర లేకుండా బైక్‌లకు కాపలా కాస్తున్నారు. పోలీసులు సైతం గ్రామ యువకులతో కలిసి పహారా కాస్తున్నారు. ఎవరూ భయాందోళనకు గురికావొద్దని పోలీసులు వివరిస్తున్నారు. నిందితులను పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. పోలీసులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొందరు గ్రామస్తులు వారి ఇంటి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. సీఐ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించడంతో 20మందికిపైగా గ్రామస్తులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు అమర్చుకున్నారు. కాగా, ఈ ఘటనలపై సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్ స్పందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పది మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని, గ్రామంలో నిఘా కొనసాగుతున్నదన్నారు. గ్రామంలో 14 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

## మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

### గణేశ్‌పూర్ శివారులో బీదర్-జహీరాబాద్ రోడ్డుపై ఆందోళన


జహీరాబాద్-బీదర్ ప్రధాన రోడ్డుపై ఆందోళన చేస్తున్న న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ ప్రజలు, మృతుల బంధువులు

జహీరాబాద్, అక్టోబర్ 8: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ గ్రామ శివారులో కర్ణాటక బస్సు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని మంగళవారం పరిసర గ్రామాల ప్రజలు, బంధువులు ఆందోళన చేపట్టారు. గ్రామ సమీపం గుండా వెళ్లే జహీరాబాద్-బీదర్ ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించే కర్ణాటక డిపో బస్సును అడ్డుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు హుటాహుటినా సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన కర్ణాటక డిపోకు చెందిన అధికారులు, సిబ్బంది వచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ ఆందోళనకారులు భీష్మించుకుని కూర్చున్నారు. కర్ణాటక డిపో అధికారులతో జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు మాట్లాడారు. జహీరాబాద్, బీదర్ ఆర్టీసీ అధికారులను హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి గ్రామస్తులు, మృతుల కుటుంబాల సమక్షంలో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఆందోళనలతో కర్ణాటక డిపో బస్సులను దారిమళ్లించారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, టీఎస్ఐఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివాజీపాటిల్, చంద్రప్ప, ఓంకర్, మల్లప్ప, గౌసోద్దీన్, శివశరణప్ప, వెంకట్‌రెడ్డి తదితరులు మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది. తాత, అమ్మానాన్న, తమ్ముడు మృతి చెందడందో అనాథలుగా మిగిలిన ముగ్గురు అక్కాచెల్లెళ్లను పట్టుకుని బంధువులు విలపించారు. బీదర్-జహీరాబాద్ ప్రధాన రోడ్డు మార్గం ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు మంజూరై ఏండ్లు గడుస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే పూడ్చాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నిజాంపేటలో పంట పొలాలపై కురుస్తున్న పొగమంచు

## కమ్మేసిన పొగమంచు

మెదక్ జిల్లా నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం పొగమంచు కమ్మేసింది. వర్షాకాలం అనంతరం మొదటిసారి కురిసిన పొగమంచుతో యువత సెల్ఫీ దిగారు. పంట పొలాలపై, రోడ్డుపై మంచు విపరీతంగా కురిసింది. దీంతో రోడ్లపై వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించారు.

–నిజాంపేట/చిన్నశంకరంపేట, అక్టోబర్ 8


చిన్నశంకరంపేటలో పొగమంచు కప్పేయడంతో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు